RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 346 పేజీలు - 08 బుధవారం 05 నవంబర్ 2025

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రత్యేక కమిటీ

**16 మంది కమిటీతో అధ్యయనం**

**ఫతి' సూచనలు పరిశీలించాలి**

**రాష్ట్ర సర్కారు తాజా ఉత్తర్వులు**

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధుల సమీకరణ అంశాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులను జారీచేశారు. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) సూచనలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకే ప్రభుత్వం ఈ ప్రత్యేక కమిటీని నియమించింది. సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చైర్మన్‌గా, ఆర్థిక శాఖ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా, విద్య, ఎస్సీ, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమం, ఉన్నత విద్య శాఖల అధికారులతోపాటు ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ కోదండరాం, ఫతి అసోసియేషన్ నుంచి ముగ్గురు ప్రతినిధులను కలిపి మొత్తంగా 13మంది సభ్యులతో కమిటీని నియమించింది. ఈ కమిటీ ట్రస్ట్ ద్వారా ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం అమలు, పారదర్శకత, హేతుబద్ధీకరణ, తదితర అంశాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం సూచించింది. మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని కమిటీకి మార్గదర్శకాలను విడుదల చేసింది.

## 'డిజిటల్ అరెస్ట్' స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

**డిజిటల్ అరెస్ట్' పేరుతో కొత్త తరహా మోసాలు**

**పోలీసులు, సీబీఐ అధికారులమంటూ బెదిరింపులు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎన్పీసీఐ సూచన**

**సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని వెల్లడి**




**తొలి అక్షరం/న్యూఢిల్లీ, నవంబర్ 04:** దేశవ్యాప్తంగా కొత్త తరహా సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) మిగతా 2లో...

## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

**డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం**

**రవాణా శాఖ, హెూంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు**

**నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం**



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్...మిగతా 2లో...



# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు

**చెల్లిని గెంటేసిన నీచుడు కెటిఆర్**

**రహమత్ నగర్ రోడ్‌షోలో సిఎం రేవంత్**

**నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే**



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీ తో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్ లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయ ండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ..మిగతా 2లో...

## ఛత్తీస్‌గఢ్‌లో గూడ్స్ రైలును ఢీకొట్టిన ప్యాసింజర్ రైలు... ఆరుగురి మృతి!

**తొలి అక్షరం/ఛత్తీస్‌గఢ్,నవంబర్ 04:**



ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో నేడు ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. జైరామ్‌నగర్ స్టేషన్ సమీపంలో ఒక ప్యాసింజర్ రైలు, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కనీసం ఆరుగురు మరణించినట్లు భావిస్తున్నారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోర్బా ప్యాసింజర్ రైలు, ఆగి ఉన్న ఒక గూడ్స్ రైలును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ప్యాసింజర్ రైలు మొదటి బోగీ.. గూడ్స్ రైలు పైకి ఎక్కింది. ప్రమాద స్థలం నుంచి వచ్చిన వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నష్టం అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది...

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

**న్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు : ఇసి**




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 4:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇప్పటికే బీహార్‌లో తీవ్ర నిరసనలు చెలరేగాయి. ఇప్పుడు బెంగాల్లో మమతా బెనర్జీ స్వయంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఫేజ్-2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను ..మిగతా 2లో...

# ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

**జూబ్లీహిల్స్ ప్రచారంలో రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు**

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. తెలంగాణను దివాళా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి బతిమిలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకునే లాగా చేశారని ధ్వజమెత్తారు...మిగతా 2లో...



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

**తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ**

**పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ**

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**



2లో.

## మంత్రి అజారుద్దీన్‌కు రెండు కీలక శాఖలు

**తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్**

**ఆయనకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి**

**మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతల అప్పగింత**

**అదేవిధంగా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కేటాయింపు**



2లో.

## జాబ్ క్యాలెండర్‌తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**




## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్**

**ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం**

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది...మిగతా 2లో...



## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది.రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**

జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది.పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

## మంత్రి అజారుద్దీన్‌కు రెండు కీలక శాఖలు

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:**ఇటీవల తెలంగాణ మంత్రిగా నియమితులైన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో శాఖలను కేటాయించారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.క్రికెటర్‌గా దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అజారుద్దీన్, రాజకీయాల్లోకి ప్రవేశించి గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖను కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

### ఒక్క అవకాశం ఇస్తే

## తెలంగాణ సర్వనాశనం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 165 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ౖ÷ర్ అయ్యారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. కేసీఆర్ హయాంలో అద్భుతంగా నడిచిన పాఠశాలలు మూతపడేలాగా చేశారని ఆక్షేపించారు. హస్తం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 100 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. ఇవాళ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేశారని విమర్శించారు. ఆయనకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. హైడ్రా పేరుతో పేదల ఇల్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆఖరి స్థానంలో నిలబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

(మొదటి పేజీ తరువాయి)

బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు డిసెంబర్ 4 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు.

## జాబ్ క్యాలెండర్ తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 04:** జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# ‘డిజిటల్ అరెస్ట్’ స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం కీలక సూచనలు జారీ చేసింది. సైబర్ నేరగాళ్లు పోలీసు, సీబీఐ, కస్టమ్స్, ఆదాయ పన్ను శాఖ అధికారులమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించింది.

**మోసం చేసే విధానం ఇదే...!**

ఈ ‘డిజిటల్ అరెస్ట్’ మోసంలో నేరగాళ్లు మొదట సాధారణ ఫోన్ కాల్ చేసి, ఆ తర్వాత బాధితులను నమ్మించడానికి వీడియో కాల్స్‌కు మారతారు. తాము ప్రభుత్వ అధికారులమని చెప్పి, బాధితులపై లేదా వారి కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్, డ్రగ్స్ రవాణా లేదా పన్ను ఎగవేత వంటి తీవ్రమైన కేసులు నమోదయ్యాయని బెదిరిస్తారు.తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తూ బాధితుల్లో భయాన్ని సృష్టిస్తారు. వీడియో కాల్స్ సమయంలో నకిలీ యూనిఫాంలు, ప్రభుత్వ లోగోలు, పోలీస్ స్టేషన్ వంటి నకిలీ నేపథ్యాలను సృష్టించి బాధితులను పూర్తిగా నమ్మిస్తారు. అంతటితో ఆగకుండా, తాము చెప్పేది నిజమేనని భ్రమింపజేసేందుకు వెనుక వైపు అధికారిక కార్యాలయాల్లో వినిపించే శబ్దాలు వచ్చేలా చూసుకుంటారు.కేసు విచారణ పూర్తయ్యే వరకు కొంత మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని బాధితులపై ఒత్తిడి తెస్తారు. “మీ పేరును కేసు నుంచి తొలగించడానికి”, “విచారణకు సహకరించడానికి” లేదా “రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్” వంటి మాటలు చెప్పి మోసపూరితంగా డబ్బులు బదిలీ చేయించుకుంటారు.ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే ఏమాత్రం ఆందోళన చెందవద్దని ఎన్పీసీఐ సూచించింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఎప్పుడూ ఫోన్ లేదా వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపవని, డబ్బులు డిమాండ్ చేయవని స్పష్టం చేసింది. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఇలాంటి ఆరోపణలు చేస్తే, వెంటనే కాల్ కట్ చేసి వారి వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపింది. అనుమానాస్పద నంబర్ల నుంచి కాల్స్ వస్తే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ, లేదా టెలికమ్యూనికేషన్ శాఖకు చెందిన ‘సంచార్ సాథీ’ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలని సూచించింది. మోసగాళ్లతో జరిపిన సంభాషణలకు సంబంధించిన మెసేజ్‌లు, స్క్రీన్‌షాట్‌లను భద్రపరుచుకుంటే, ఫిర్యాదు చేసేటప్పుడు అధికారులకు సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని ఎన్ పీసీఐ తన ప్రకటనలో వివరించింది.

# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు


(మొదటి పేజీ తరువాయి)

అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. ’పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేట లో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్.. మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించిన ది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, అరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు



రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది.

6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

## నక్సల్స్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ...

## ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేసిన డీఆర్‌జీ బలగాలు

**తొలి అక్షరం/ఛత్తీస్‌గఢ్, నవంబర్ 04:** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని దట్టమైన అడవుల్లో రహస్యంగా నడుపుతున్న ఆయుధాల తయారీ కర్మాగారాన్ని డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బలగాలు గుర్తించి ధ్వంసం చేశాయి. ఈ మెరుపుదాడిలో భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కోయిమెంట-ఎరపల్లి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు.

కొన్ని నెలలుగా మావోయిస్టులు ఈ ఫ్యాక్టరీని అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. సోలార్ ప్యానెళ్ల సహాయంతో నడిచే ఈ వర్క్‌షాప్‌లో ఆయుధాలను తయారు చేస్తున్నట్లు బలగాలు గుర్తించాయి. దాడి సమయంలో సగం తయారైన 17 నాటు తుపాకులు,



బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, పెద్ద మొత్తంలో ఉక్కు రాడ్లు, ట్రిగ్గర్ మెకానిజమ్స్, లేత్ మెషీన్లు, వెల్డింగ్ కిట్లు, డ్రిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు మందుపాతరల తయారీకి సిద్ధంగా ఉంచిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, సర్క్యూట్ బోర్డులను కూడా సీజ్ చేశారు.ఈ ఆపరేషన్ వివరాలను సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ మీడియాకు వెల్లడించారు. కొద్ది వారాల క్రితం లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన కచ్చితమైన సమాచారంతోనే ఈ స్థావరాన్ని గుర్తించగలిగామని తెలిపారు. ఆ స్థావరంలో ఆర్మీ రైఫిళ్లతో సరితూగే ఆయుధాలను తయారు చేసేందుకు సంబంధించిన బ్లూప్రింట్లను కూడా కనుగొన్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 249 మంది నక్సలైట్లను మట్టుబెట్టినట్లు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు వంటి అగ్రనేతలు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. “వరుస ఎదురుదెబ్బలతో బలహీనపడిన మావోయిస్టులు, ఈ ఫ్యాక్టరీ ద్వారా మళ్లీ పుంజుకోవాలని చూశారు. కానీ మేం వారి ప్రయత్నాన్ని సమాధి చేశాం” అని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ అనంతరం స్థావరంలోని పేలుడు పదార్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేసి, మొత్తం ఫ్యాక్టరీని దగ్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా సిబ్బంది సురక్షితంగా తమ శిబిరానికి చేరుకున్నారు.

## ఈవీఎంలు గట్టిగా నొక్కండి... ఆ మోత ఇటలీ దాకా వినపడాలి: అమిత్ షా

**తొలి అక్షరం/బీహార్, నవంబర్ 04:**బీహార్‌లో మళ్లీ ‘జంగిల్ రాజ్’ (అరాచక పాలన)ను ప్రజలు కోరుకోవడం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల పాలనలో రాష్ట్రం అరాచకంగా మారిందని, ఆ చీకటి రోజులను ఎవరూ మర్చిపోలేరని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పశ్చిమ చంపారన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. “నవంబర్ 6, 11 తేదీల్లో ఈవీఎం బటన్‌ను ఎంత గట్టిగా నొక్కాలంటే, ఆ మోత ఇటలీలో ప్రతిధ్వనించాలి” అంటూ ఓటర్లకు ఆయన పిలుపునిచ్చారు. 1990లు, 2000ల ప్రారంభంలో రాష్ట్రంలో నేరాలు, అరాచకాలు పెరిగిపోయాయని గుర్తుచేసిన అమిత్ షా, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయని తెలిపారు. లాలూ-రబ్రీ హయాంలోనే రాష్ట్రంలోని అనేక చక్కెర మిల్లులు మూతపడ్డాయని ఆరోపించారు. మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తే, మూతపడిన అన్ని మిల్లులను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.సోనియా గాంధీ, లాలూ ప్రసాద్ యాదవ్‌లను లక్ష్యంగా చేసుకుని అమిత్ షా విమర్శలు గుప్పించారు. “ఒక నాయకురాలు తన కొడుకును ప్రధానమంత్రిని చేయాలని చూస్తుంటే, మరో నాయకుడు తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలని ఆరాటపడుతున్నారు. కానీ ఢిల్లీలో గానీ, పాట్నాలో గానీ కుర్చీలు ఖాళీగా లేవని వారు గుర్తుంచుకోవాలి” అని ఆయన ఎద్దేవా చేశారు.రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ, 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ భద్రత విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని, ఆర్టికల్ 370 రద్దు కూడా అందులో భాగమేనని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కొందరు నేర చరితులను వెనకేసుకొస్తున్నా యని, అలాంటి శక్తులను ఓటర్లు తిరస్కరించాలని కోరారు.

# ఏదల్ల యాదవ రెడ్డి జన్మదిన వేడుకలకు నెల్లికుదుర్‌లో భారీ సన్నాహాలు!

- బుధవారం గెస్ట్ హౌస్‌లో ఘనంగా జరగనున్న వేడుకలు
- పార్టీకి ప్రాణం పోసిన నాయకుడని ప్రశంసించిన పెరుమల్ల జగన్ బాబు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 4:** మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదల్ల యాదవ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నెల్లికుదుర్ మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ యూత్ నాయకుడు పెరుమల్ల జగన్ బాబు అన్నారు ు "ఏదల్ల యాదవ రెడ్డి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అంకితభావ నాయకుడు. ప్రజల సమస్యలను గుండెల్లో పెట్టుకుని పోరాడే వీర కాంగ్రెస్ సైనికుడు. ఆయన సేవలు మాకు స్ఫూర్తి" అని చెప్పారు. "బుధవారం జరిగే వేడుకలో మండలంలోని అన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మేధావులు పెద్ద ఎత్తున హాజరై వేడుకను విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఏదల్ల యాదవ రెడ్డినాయకత్వం పట్ల అందరికీ గౌరవం ఉంది. ఆయన వంటి నేతలు పార్టీ బలానికి ప్రతీక" అని పేర్కొన్నారు.

# ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 4:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటర్ జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలని తహసిల్దార్ గడీల శ్రీనివాస్ తెలిపారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణపై ఆయా విభాగాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక లాగిన్ ఇచ్చి వార్డుల వారీగా జాబితా సవరిస్తామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు కుటుంబ సభ్యులందరినీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలను పకడ్బందీగా జియోగ్రాఫికల్ మ్యాపింగ్ చేయాలని ఎన్నికల సంఘం అధికారులు నిర్ణయం తీసుకున్నారని, ఆ మ్యాపింగ్ చేసే సమయంలో ఇంటి నెంబర్లను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిటి నరసయ్య, ఆర్ఐ నజీముద్దీన్,పాలకుర్తి డిటి గుగులోతు దేవా, ఎలక్షన్ ఆపరేటర్ ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్తీక మాసం సందర్భంగా ఏన్కూరులో జ్యోతిర్లింగార్చన



**తొలి అక్షరం/ఏన్కూర్,నవంబర్4:** పవిత్ర పుణ్యమాసమైన కార్తీక మాసం సందర్భంగా, రెండవ సోమవారం నాడు ఏన్కూరులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం నందు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. **ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం:** ప్రాతఃకాలంలో స్వామివారికి పండితులు అభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ప్రదోష వేళలో ఆలయ ప్రాంగణం అంతా భక్తుల శివనామస్మరణలతో మారుమోగిపోయింది. శివాలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి, ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. దీంతో ఆలయం అంతా భక్తులతో కిటకిటలాడిపోయింది. **వైభవంగా జ్యోతిర్లింగార్చన:** ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శివ లింగాకార రూపాన్ని గీసి, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఆలయ ధర్మకర్త గోరంట్ల శ్రీనివాస్ చౌదరి, మంజుల దంపతులు జ్యోతిర్లింగాలను వెలిగించారు. ఆలయ అర్చకులు మేడూరి కిరణ్ కుమార్ నాయుడు, కిషోర్ కుమార్ లు వేదమంత్రాలు పఠిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేముల రమేష్, వైస్ చైర్మన్ కొప్పుల ప్రభావతి రెడ్డితో పాటు భక్తులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# పత్తి రైతుపై సిసిఐ విధించిన ఆంక్షలు ఎత్తి వేయాలి: సిపిఎం ఆలేరు మండల కార్యదర్శి దూపటి వెంకటేష్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** పత్తి పంట సాగు చేస్తున్న రైతులపై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ)విధించిన నూతన నిబంధనలను ఎత్తివేయాలని సీఎం ఆలేరు మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం రోజు ఆలేరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ,పత్తిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే విషయంలో ఇప్పటికే అనేక నూతన నిబంధనలను విధించిన సిసిఐ రైతు నెత్తిన మరో పిడుగు లాంటి నిబంధనను విధించింది, ఇక నుండి ఎకరాకు 7 క్వింటాళ్ల కన్నా ఎక్కువ పత్తిని సిబిఐ కేంద్రాల్లో విక్రయించడానికి వీలు లేదు అనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం తాజాగా విధించినది. ఇప్పటివరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తినీ సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేసేట్టు ఉండగా, దాన్ని 7 క్వింటాళ్లకు పరిమితి చేసింది. సీసీఐ కేంద్రాల్లో అయితే క్వింటాల్ పత్తికి 8110 మద్దతు ధర లభిస్తుంది. మద్దతు ధర కూడా సవాలక్ష ఆంక్షలు విధించిన సిసిఐ,కొత్తగా ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి నిబంధన తెచ్చి రైతులను ఇబ్బందుల పాలు చేస్తుంది.ఒకవైపు అధిక వర్షాలతో దిగుబడి తగ్గి,రైతులు నష్టపోగ,ఈ సంవత్సరం సీసీఐ కపాస్ కిసాన్ యాప్ అనే యాప్ లో స్లాట్ బుక్ చేసుకుంటేనే రైతులు పత్తి విక్రయానికి అనుమతి వస్తుంది.ఒక వైపు ఈ యాప్ లో సాంకేతిక సమస్య రైతులను ఇబ్బంది పాలు చేస్తుండగా,మరో వైపు కొత్త కొత్త నిబంధనలు తెచ్చి రైతులను నట్టేట ముంచే విధంగా సిసిఐ, కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు ఉంటున్నాయి అని విమర్శించారు.వెంటనే ఈ పరిమితి నిబంధన ఎత్తి వేయాలి అని,లేనిచో మండల వ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళన , పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నల్లమాస తులసయ్య,పిక్క గణేష్,గ్యార భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి

**ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 4:** గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గం ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి అన్నారు. మంగళవారం విలేకరులతో రాజమౌళి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులే పల్లెలకు పట్టుకొమ్మలని గ్రామీణ వైద్యులు లేని గ్రామం ఆరోగ్యంగా ఉన్న దాఖలాలు లేవని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స చేస్తూ ప్రజలను ఆర్థికంగా చితికి పోకుండా కాపాడడంలో గ్రామీణ వైద్యుల సేవ ఎనలేనిదని అలాంటి గ్రామీణ వైద్యుల ను ప్రభుత్వం విస్మరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ వైద్యులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల గ్రామీణ రైతులందరినీ ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

# యువత శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 4:** యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ తెలిపారు. తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభ సమావేశం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రాములు అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వాల్యా నాయక్, సుజాత లతో కలిసి జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడారు. యువత శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, నేటి యువతే దేశ భవిష్యత్తు అన్నారు. శాస్త్రీయ ఆలోచనతో ముందుకు సాగితేనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు పరిశోధనాత్మక దృష్టిని పెంపొందించుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ప్రిన్సిపాల్ బి. రాములు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతోనే పరిపూర్ణ పౌరులుగా మారతారని తెలిపారు. యువత సమాజానికి మార్గదర్శకులు కావాలని,శాస్త్రీయ దృక్పథం ఉన్నప్పుడే వారు సమాజంలో సానుకూల మార్పులు తీసుకురాగలరని తెలిపారు. ప్రతి ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఒక మార్పుకు దారి చూపే దీపం కావాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,సామాజిక చైతన్యం, శాస్త్రీయ దృక్పథం అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ జి. మోహన్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం జి.తనూజ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతి కుమార్, ఉపాధ్యాయులు యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కొలనుపాకలోని ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లాకలెక్టర్ ఎం హనుమంతరావు. కొనుగోలు కేంద్రంలో మంగళవారం రోజు కురిసిన వర్షానికి ధాన్యం ఏమైనా తడిసిందా అని అడిగారు. రైతులు అందరూ కలిసి ఎల్లపుడు అప్రమత్తంగా ఉండాలని ఈ అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలవని పరిస్థితి ఉందని. ధాన్యపు కుప్పలను టార్పాలిన్స్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు అని అడిగారు. కొనుగోలు చేసినంత వరకు టాబ్ ఎంట్రీ పూర్తి అయిందా అని అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు రోజు తేమశాతం చెక్ చేసి వచ్చిన ధాన్యం కుప్పలను కాంటా వేయాలని ఆదేశించారు. ఈ కొనుగోలు కేంద్రంలో వచ్చే సీజన్ వరకు రైతులు సేద తీరేందుకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ ఆంజనేయులుకి సూచించారు.

# శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్నకి వినతిపత్రం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్నతో ఓపెన్ టాక్ కార్యక్రమానికి మంగళవారం రోజు చౌటుప్పల్ మీదుగా నల్లగొండకు వెళుతున్న ఎమ్మెల్సీని పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్ మెంట్ గూర్చి ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయించగలరని మనవి చేస్తూ చౌటుప్పల్ ప్రయివేటు ఇంటర్, డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ)తీన్మార్ మల్లన్నకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంజీయూ ప్రయివేటు మేనేజ్మెంట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బత్తుల శంకర్ ,నలంద డిగ్రీ కళాశాల,మాతృశ్రీ డిగ్రీ కళాశాల, ప్రతిభ ఒకేషనల్, జేబీఎం ఒకేషనల్,బీ.పిడి,శ్రీ చైతన్య పారమెడికల్ కళాశాల మేనేజ్మెంట్ మరియు ప్రైవేటు అధ్యాపక బృందం సభ్యులు,చిలువేరు శ్రీనివాస్,వాలుగొండ శ్రీనివాస్, జంగయ్య,చిలువేరు దుర్గయ్య, గుఱ్ఱం రవి కుమార్,కట్టెల లింగస్వామి,శేఖర్ రెడ్డి,పానుగుళ్ల మల్లేశం,సంకటి అంజయ్య, గంగాదేవి మహేష్,దేవరకొండ శ్రీను,బీసీ పొలిటికల్ జేఏసీ చౌటుప్పల్ కన్వీనర్ గట్టు మొగలయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబోయద్దు



**తొలి అక్షరం/పాపన్నపేట నవంబర్ 04:** మండలంలో రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ఎల్లాపూర్ వద్ద ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడుతూ...రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రాత్రివేళ ధాన్యం కుప్పలపై నల్లని టార్పాలిన్ కప్పి ఉంచడం వల్ల అవి వాహనదారులకు కనిపించక పెద్ద ప్రమా దాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. వాహనదారులకు ఇబ్బం దులు లేకుండా వేరే చోట ధాన్యం ఆరబోసుకోవాలన్నారు. ధాన్యం కుప్పల వద్ద ప్రమా దాలు జరిగితే చర్యలు తప్పవన్నారు. రైతులు సహకరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

# ఈనెల ఒకటి నుండి డిపాజిట్ సేకరణ మాసోచ్చావం

- డిసిసిబి మేనేజర్ దీపక్ కుమార్



**తొలి అక్షరం/పాపన్నపేట, నవంబర్ 4:** జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెల ఒకటి నుండి 30 వరకు డిపాజిట్ల సేకరణ మహెూత్సవం నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ దీపక్ కుమార్ వెల్లడించారు, మాస ఉత్సవాలలో భాగంగా ఆయన మండల కేంద్రమైన పాపన్నపేటలో మాట్లాడారు. ఇందులో భాగంగా స్వర్ణానిధి డిపాజిట్ పథకం చేపట్టినట్లు ఆయన తెలిపారు, ఈ పథకంలో భాగంగా 444 రోజులకు గాను అత్యధిక శాతం 7.75 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ ఇస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు, తమ బ్యాంకులో లాకర్ సౌకర్యంతో పాటు గోల్డ్ లోన్ సౌకర్యం ఉందని ఆయన వెల్లడించారు.

# రత్నాల వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం వినతి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో నవంబరు 04:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహాదారు వేమిరెడ్డి నరేందర్ రెడ్డిని మంగళవారం రోజున టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్ కలవడం జరిగింది. అలేర్ నుండి మంతపురి దారిలో ఉన్న రత్నాల వాగు పైన బ్రిడ్జి నిర్మాణం కోసం విజ్ఞప్తి చేయడం జరిగింది. వర్షాల వల్ల ఈ దారిలో రోజు ప్రయాణించే ప్రజలు మరియు స్కూల్ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

# బోరబండలో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ముమ్మర ప్రచారం

**- వివిధ వర్గాలకు బాకీ కార్డులు అందచేసిన బూడిద,కల్లూరి**

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్లో గాంధీనగర్ నగర్,అంబేద్కర్ నగర్,పెద్దమ్మ వాడలో వివిధ వర్గాలకు బాకీ కార్డు అందజేసిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరు రామచంద్రారెడ్డి, బొమ్మలరామారం మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## మద్యం షాపులు జనా వాసాల నుండి తీసివేయాలి:బిఎన్ రెడ్డి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో గ్రామాలలో జన ఆవాసాలకు కిలోమీటర్ దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలని అవినీతి నిర్మూలన ఐక్య వేదిక వ్యవస్థాపకులు బండారు నరసింహారెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలు నివాసము ఉండే ప్రాంతాలకు దూరంగా కనీసం ఒక కిలోమీటరు దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి.మద్యం తాగిన తర్వాత మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించే అవకాశం ఉంది. చిన్నపిల్లలపై మద్యం ప్రభావం చూపే అవకాశం ఉంది. యాక్సిడెంట్ జరిగే ప్రమాదం ఉంది.చుట్టుపక్కల ఉండే కుటుంబాలకు అసౌకర్యంగా ఉంటుంది.అందుకని గ్రామానికి కనీసం కిలోమీటర్ దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి.ఇదే సందర్భంలో బెల్టు షాపులను పూర్తిగా నిషేధించాలి. బెల్టు షాపుల వల్ల చాలా ప్రమాదం పొంచి ఉంది.ఉదయం 6 గంటలకే బెల్టు షాపులలో తాగి భార్యా పిల్లలతో గొడవపడి ప్రాణాలు తీస్తున్నారు.ఇతరులను హత్యలు కూడా చేస్తున్నారు. తాగిన మైకంలో దొంగతనాలు చేస్తున్నారు. దోపిడీలు చేస్తున్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి. ఎమ్మెల్యేలు,ప్రభుత్వం,అధికారులు,సరియైన చర్యలు వెంటనే తీసుకోవాలి అని బండారు నర్సింహారెడ్డి అన్నారు.

## చిన్ననాగారం ముదిరాజ్ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

**- అధ్యక్షుడిగా బతెము సోమయ్య, ఉపాధ్యక్షుడిగా శీలం శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల పెద్ద వెంకన్న ఎన్నిక**



**తొలి అక్షరం/ఇనుగుర్తి. నవంబర్ 4:** ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఎన్నికలు ఉత్సాహంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్ సమాజం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశారు.గ్రామ కమిటీకి ముగ్గురు నాయకులు పోటీ పడగా, అందరి ఏకాభిప్రాయంతో బతెము సోమయ్యను గ్రామ అధ్యక్షు డిగా, శీలం శ్రీనును ఉపాధ్యక్షుడిగా, ముత్యాల పెద్ద వెంకన్నను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.ఈ సందర్భ ంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు బతెము సోమయ్య మాట్లాడు తూ, “నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క సంఘ నాయకు డికి, సభ్యుడికి హృదయపూర్వక ధన్యవాదాలు. గ్రామంలోని ప్రతి ముదిరాజ్ కుటుంబం సుఖసంతోషాలతో ఉండేలా కృషి చేస్తాను. మన సంఘ బలాన్ని మరింత పెంచి, యువతను సామాజిక సేవలో ముందుకు తీసుకెళ్తాను,” అని తెలిపారు.

## మంత్రి హరీష్ రావును పరామర్శించిన కల్లూరి రామన్న



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** మాజీ మంత్రి సిద్ధిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావుని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న దైద రవీందర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 4:** కేతేపల్లి మండలం కొండకింది గూడెం గ్రామానికి చెందిన కోట్ల వెంకట్ రెడ్డి మాతృమూర్తి కోట్ల రాములమ్మ దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినరు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మేరెడ్డి ప్రవీణ్ రెడ్డి ఇనుపముల మాజీ ఎంపీటీసీ తుమ్మనగోటీ సాగర్ కాంగ్రెస్ నాయకులు యానాల సైదిరెడ్డి పట్టేటి విద్యాసాగర్ పైసా సతీష్ రెడ్డి పసల ప్రేమ్ జాల శ్రీనివాస్ రెడ్డి లింగయ్య ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...



## ట్రినిటీ విద్యాసంస్థల సౌజన్యంతో మల్లఖంబ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ క్రీడల ప్రారంభం

**● ముఖ్య అతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజాగోపాల్ రెడ్డి**









**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మంగళవారం రోజున తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ, 69వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ట్రినిటీ విద్యాసంస్థల సౌజన్యంతో చౌటుప్పల్ పట్టణంలో మల్లఖంబ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.రాష్ట్రస్థాయి మల్లఖంబ్ క్రీడల ప్రారంభోత్సవానికి వచ్చిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన విద్యాశాఖ అధికారులు ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థిని విద్యార్థులు.రెండు రోజులపాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండా ఆవిష్కరించి ప్రారంభించిన రాజగోపాల్ రెడ్డి, అనంతరం ఈ ఛాంపియన్షిప్లో పాల్గొనే 7 ఉమ్మడి జిల్లాల క్రీడాకారుల వందన సమర్పణ స్వీకరణ. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు విద్యార్థులదే,వారికి ఎంత చేసినా తక్కువే. చదువులోనే కాదు క్రీడల్లో రాణించినప్పుడే మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండండి క్రీడలకు దగ్గరగా ఉండండి.క్రీడల్లో పాల్గొనేటట్లుగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలి.ప్రభుత్వ విద్య ప్రభుత్వ వైద్యం రెండు బాగున్నపుడే పేదలకు న్యాయం జరిగినట్లు.గ్రామాలలో మన చిన్ననాడు ప్రభుత్వ బడులు ఎలా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాయి.ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మన ప్రభుత్వాలపైన ఉంది.ప్రభుత్వ బడులలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నా వంతుగా ప్రభుత్వంతో మాట్లాడతా. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద కొంతమేర ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇటీవల మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో 1.50 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించాం. సమాజసేవలో ఉన్న గొప్ప వ్యక్తులు ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావాలి.మల్లఖంబ్ క్రీడను ప్రోత్సహిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యానికి నా ప్రత్యేక ధన్యవాదాలు.

## తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ చైర్మన్గా ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరామ్ ఏకగ్రీవం





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ చైర్మన్గా ఏకగ్రీవంగా ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాంని ఉద్యమకారుల సంఘాలు ఎన్నుకోవడం జరిగింది. కమిటీ ఎజెండాను ప్రకటించింది. వారం రోజులలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి పొన్నం ప్రభాకర్లతో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీపై గుర్తింపుకై సమస్యలపై హక్కుల సాధనకై ఉద్యమకారుల సంఘాలతో మొదటి వారంలో ప్రెస్ మీట్ పెట్టనున్న ఉద్యమ రథ సారధి ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం. ఉమ్మడి పది జిల్లాల వేదికగా ఉద్యమకారులతో నవంబరు నెలలో ఆత్మీయ సమావేశాలు. డిసెంబరు మూడో తారీకునాడు తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతచారి వర్ధంతిని ఎల్బీనగర్ చౌరస్తాలో ఉద్యమ కారులతో భారీ ఎత్తున జరుపుటకు నిర్ణయించడం జరిగింది.కావున ఈ విషయాన్ని ఉద్యమకారులు గమనించగలరనియు,ఉద్యమకారులకు డిసెంబరు నెలలో తీపి కబురు చెప్పనున్న ఉద్యమ రథసారధి అని తెలంగాణ రాష్ట్రంలోని 33జిల్లాల ఉద్యమకారులు హాజరు కావాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామరోజు వీరాచారి పత్రికల వారితో మాట్లాడుతూ తెలిపారు.

## గొర్రెల దొంగలను వెంటనే పట్టుకొని బాధితులకు భరోసా కల్పించాలి

**● డిసిపి ఆకాంక్ష్ యాదవ్‌కు జిఎంపిఎస్ జిల్లా కమిటీ విజ్ఞప్తి**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** యాదాద్రి భువనగిరి జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న గొర్రెల దొంగలను వెంటనే గుర్తించి బాధితులకు భరోసా కల్పించాలని జిఎంపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల నర్సింహ్మా భువనగిరి డిసిపి ఆకాంక్ష్ యాదవ్ ను కోరారు. మంగళవారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ వేగవంతం చేసి నిందితులను త్వరగా గుర్తించి చట్ట పరిధిలో కఠినంగా శిక్షించి వృత్తిదారులకు నష్ట పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.గత నాలుగునెలల కాలంలో జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి మండలాల్లో వరుసగా జరుగుతున్న గొర్రెల దొంగతనాలను చూసి గొల్ల కురుమలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వడపర్తిలో మేడబోయిన బాలయ్య మందలో అక్టోబర్ 28న 50గొర్రెలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపోయారని, గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధి నీలంబావి,రాయరావుపేట ప్రాంతాలలో సుమారు 47 గొర్రెలు,1పొట్టేలు,3 మేకలు దోపిడీకి గురయ్యాయని ఇట్టి విషయాన్ని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి నెల రోజులు దాటినా ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాయరావుపేట,వడపర్తిలో జీవాలను ఎత్తుకెళ్ళిన వ్యక్తులు,నాలుగు చక్రాల వాహనం సిసి ఫుటేజీలో నమోదైన వీడియోలను బాధితులు పోలీసులకు చూపెట్టినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.హైదరాబాద్ నగరం పరిసర ప్రాంతాలలో జీవాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి.వీటిని అరికట్టేందుకు రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నర్సింహ్మా,అధ్యక్షులు మద్దెపురం రాజు,ఉపాధ్యక్షులు బుడుమ శ్రీశైలం,సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం,రాష్ట్ర కమిటీ సభ్యులు ఎల్లంల సత్యనారాయణ,జిల్లా కమిటీ సభ్యులు క్యాసాని నవీన్, బీమగోని బాలరాజు,నరాముల గణేష్,బుగ్గ లక్ష్మయ్య,బాధితులు మేడబోయిన బాలయ్య, మన్నెబోయిన రాములు పాల్గొన్నారు.

## రెండవ రోజుకు చేరిన డిగ్రీ, పీజీ కళాశాలల బంద్








**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం చేపట్టిన నిరవధిక బంద్ రెండవ రోజున కూడా కొనసాగింది.ఈ సందర్భంగా నేడు వినాయక చౌరస్తా నందుగల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహనికి ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యాలు వినతిపత్రం సమర్పించారు. మరియు అలాగే భువనగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేసినారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల అసోసియేషన్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి అసోసియేట్ ప్రెసిడెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ “రెండవ రోజు కూడా బంద్‌లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలు పాల్గొన్నాయి అని,మంగళవారం రోజు మేము డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించడం ద్వారా విద్యా హక్కు కోసం మమ్మల్ని గౌరవించేలా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం” అని తెలిపారు.శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ప్రైవేట్ కళాశాలల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని,తక్షణమే బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల అసోసియేషన్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి అసోసియేట్ ప్రెసిడెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్,జాగృతి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మహిపాల్ రెడ్డి మరియు ప్రిన్సిపల్ లు మరియు అధ్యాపకులు హాజరైనారు.

## కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి పర్యవేక్షణలో “కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్‌బీ ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్” అనే అంశంపై చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు గాను కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును మంజూరు చేసింది.సామాజిక న్యాయ సాధనలో ఎల్లప్పుడూ ముందుండే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మార్గ నిర్దేశకత్వంలో నడుస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) లో కీలక నాయకుడిగా ఎదిగిన శేఖర్ ఓయూ అధ్యక్షుడిగా,పలు జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా తన సేవలను అందిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం యర్కారం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించిన తల్లిదండ్రులు సరోజ–అంజయ్య దంపతులకు జన్మించిన శేఖర్ చిన్న వయసులోనే విద్యపట్ల ఆసక్తి పెంచుకొని,ఐదవ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్యను అభ్యసించారు.ఆపై ఎల్.బి. నగర్‌లో పదో తరగతి వరకు, ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి తక్కువ వనరులతోనే ఉన్నత విద్య వైపు అడుగులు వేశారు.నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న కాలంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడగా,విద్యార్థి నాయకుడిగా పోరాటాలలో ముందు వరుసలో నిలబడి తన కృషితో అందరి దృష్టిని ఆకర్షించారు.అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో పీజీ పూర్తి చేసిన శేఖర్ ఒకవైపు సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే, మరోవైపు ఉన్నతవిద్యలో ప్రగతిని ఆపకుండా పీహెచ్‌డీ ప్రవేశం పొంది పరిశోధనలో ప్రతిభ చాటారు.డాక్టరేట్ బిరుదు అందుకున్న అనంతరం తనకు స్ఫూర్తిగా నిలిచిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగను వారి నివాసంలో ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పరిశోధన అవాంతరం లేకుండా పూర్తిచేయడానికి ఎంతో చొరవ తీసుకొని సహకరించిన తన గురువు ప్రొఫెసర్ వై. పార్థసారథితో పాటు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని అధ్యాపకులు,సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. చిన్నతనంలో కూలీ పనులు చేస్తూ మరోవైపు సామాజిక న్యాయం,సమానత్వ సాధన కోసం జరిగిన దండోరా ఉద్యమంలో నిబద్ధతతో పనిచేస్తూనే, విద్యను ఆయుధంగా మార్చుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకున్న కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకవర్గం, విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.



# "నైనాల రైతుల కష్టాలకు చెక్ పెట్టాలంటే... వెంటనే శాశ్వత ఏ ఈ ఓ నియామకమే పరిష్కారం!": యాసం రమేష్

**పంటల నమోదు ఆగిపోవడంతో రైతులు ఆందోళనలో**

**మొంతా తుఫాన్‌తో పంటలు నష్టపోయినా సర్వే మొదలు కాలేదు**

**రేపటితో గడువు ముగియనుండగా పరిహారం దూరంలో**

**రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడి వినతిపత్రం జిల్లా అధికారికి సమర్పణ**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 4:** నెల్లికుదురు మండలం నైనాల క్లస్టర్ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని మాజీ రైతు బంధు సమితి అధ్యక్షుడు యాసం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. క్లస్టర్‌లో శాశ్వత వ్యవసాయ విస్తరణ అధికారి ( ఏ ఈ ఓ) లేకపోవడం వలన పంటల నమోదు ఆగిపోయిందని, రైతులు తమ పండించిన పంటలను అమ్ముకునే అవకాశం లేక ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆయన జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యాలయంలో ఏ డి ఏ (పరిపాలన అధికారి) మురళి కి ఈ వినతిపత్రాన్ని అందజేశారు.యాసం రమేష్ మాట్లాడుతూ "ఇటీవల మొంతా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారు. రేపటితో పంటనష్టం సర్వే గడువు ముగుస్తున్నప్పటికీ, నైనాల క్లస్టర్ పరిధిలో ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా సర్వే ప్రారంభించలేదు. దీంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశం లేకుండా పోతుంది. ఇది రైతుల పట్ల ఘోర నిర్లక్ష్యం" అని ఆవేదన వ్యక్తం చేశారు."రైతుల కష్టాలు తగ్గాలంటే, ప్రభుత్వ పథకాలు గ్రామాల దాకా చేరాలంటే ౹ నైనాల క్లస్టర్‌కు వెంటనే శాశ్వత పద్ధతిలో ఏ ఈ ఓ నియామకం అవసరం. ఒక అధికారి లేకపోవడం వల్ల వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఈ అంశంపై అత్యవసరంగా స్పందించాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నైనాల మాజీ చైర్మన్ ఆవుల సాయిమల్లు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం



**తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 4:**జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో భాగంగా మంగళవారం నాడు రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ఒకటి మరియు రెండవ బూతులలో నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గడచిన పది ఏళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి దిశగా వెనుకబడిపోయిందని,ఈసారి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.ప్రతి ఇంటి ప్రజలు చేతి గుర్తు మీద ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

**రేపు ఎమ్మెల్యే, ఎంపీల కార్యాలయాలను ముట్టడిద్దాం**

**ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్**



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04:** రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని విడనాడి వెంటనే నిధులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు.రేపు, తేదీ 5-11-2025 న రాష్ట్ర ఆదేశాల మేరకు విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాలను ముట్టడించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు ?8500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.విద్యార్థులు తమ చదువు కొనసాగించడానికి, ఫీజులు చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం స్పందించాలి, లేనిపక్షంలో విద్యార్థి సమాజం తీవ్ర ఆందోళనకు దిగుతుందని ఆకాష్ నాయక్ హెచ్చరించారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# స్కూల్ డ్రైవర్లు స్కూల్ విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు




**తొలి అక్షరం/ మిర్యాలగూడ/ నవంబర్ 4:** మిర్యాలగూడ, పరిసర ప్రాంత పాఠశాల విద్యార్థులను గమ్యం స్థానాలకు చేర్చే బస్సు డ్రైవర్ల నుద్దేశించి డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఇళ్ల నుంచి తీసుకు వెళ్లేటప్పుడు గాని, పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లేటప్పుడు గాని అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని,విద్యార్థుల పట్ల మిస్ బిహేవ్ చేసిన వారి విషయంలో కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ప్రతి పాఠశాల నియమ నిబంధనలు, రవాణా సౌకర్యానికి సంబంధించి బస్సుకు పూర్తి ఫిట్నెస్ తో ఉండాలని పిల్లల భవిష్యత్తుతో ఆడుకో రాదని బస్సు డ్రైవర్లకు, పాఠశాల యాజమాన్యంను హెచ్చరిస్తూ వారి బాధ్యతను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# మైనారిటీ సమస్యలపై చర్చించిన హనుమకొండ జిల్లా మైనారిటీ చైర్మన్ మీర్జా అజీజుల్లా బేగ్





**తొలి అక్షరం/హనుమకొండ :** ఏఐసీసీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రతాప్‌గఢి,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా మైనారిటీ బృందం గాంధీ భవన్‌లో మైనారిటీ సమస్యలపై చర్చలకు హాజరైంది.ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు,టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్,రాష్ట్ర చైర్మన్లు,జిల్లా మైనారిటీ చైర్మన్లు,వైస్ చైర్మన్లు పాల్గొన్నారు. మైనారిటీలకు ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా మైనారిటీ చైర్మన్ మీర్జా అజీజుల్లా బేగ్ మైనారిటీ వర్గాలకు సంబంధించిన అనేక సమస్యలను ఉన్నత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై హైకమాండ్ త్వరలో ప్రత్యేకంగా చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని పరిశీలకులు హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పథకాలు, సంక్షేమ విధానాలు ప్రజల విశ్వాసం పొందుతుండటంతో పలు మైనారిటీ ప్రముఖులు పార్టీతో కలిసినట్లు నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మైనారిటీ చైర్మన్ మీర్జా అజీజుల్లా బేగ్‌తో పాటు కార్పొరేటర్ పోతుల శ్రీమాన్,వైస్ చైర్మన్లు ఎం.ఏ. షబ్బీర్ (తబ్బు), అబ్దుల్ బాకీ, ఎండీ వహీద్, ఉద్యమకారిణి రహీమునిస్సా, అయేషా నస్రీన్, ఎండీ షకీర్, సయ్యద్ జాహెద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవుల సంక్షేమానికి కృషి

**- ఎల్లవేళలా తోడ్పాటు ఉంటుంది: శాసనసభ్యులు వైద్యులు మురళి నాయక్**






**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 4:** క్రైస్తవుల సంక్షేమానికి తన కృషి ఎల్లవేళలా ఉంటుందని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ భరోసా ఇచ్చారు. ఎం డి పి ఎల్ ఎఫ్ ఆరోవ వార్షికోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీ లో గల షారోన్ సంఘంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పాస్టర్స్ లే లీడర్స్ ఫెలోషిప్ ఎం డి పి ఎల్ ఎఫ్ యొక్క ఆరవ వార్షికోత్సవం కార్యక్రమం జిల్లా అధ్యక్షులు పిల్లి కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, సి ఆర్ ఐ ఐ నేషనల్ ప్రెసిడెంట్ అడిషనల్ డీజీపీ కూచిపూడి బాబురావు తెలంగాణ రాష్ట్ర స్టేట్ ప్రెసిడెంట్ క్రిస్టఫర్ బొజ్జ ఎండి పి ఎల్ ఎఫ్ ఫౌండర్ చైర్మన్ మల్లెపాక తిమోతి గార్లు ఆహ్వానితులుగా పాల్గొని మాట్లాడారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులకు ఎల్లవేళలా అండదండగా ఉంటుందని రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమానికి అన్ని రంగాలలో అభివృద్ధి కొరకు రేవంత్ రెడ్డి నాయకత్వంలో పెద్దపీట వేస్తుందని కావున క్రైస్తవులకు ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మహబూబాబాద్ నియోజకవర్గ క్రైస్తవులకు సమాధుల స్థలం, కమ్యూనిటీ హాల్, చర్చిల నిర్మాణాలకు నా వంతుగా సంపూర్ణ సహకారం అందజేస్తానని తెలియజేశారు. సి ఆర్ ఐ ఐ నేషనల్ ప్రెసిడెంట్ రాష్ట్ర ప్రెసిడెంట్ కూచిపూడి బాబురావు, కృష్టఫర్ బొజ్జ లు మాట్లాడుతూ క్రైస్తవులపై అనేకమైన దాడులు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని ఇలాంటి సమయాలలో క్రైస్తవులు అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. క్రైస్తవులపై చర్చిలపై దాడులను ప్రభుత్వాలు అరికట్టే విధంగా చట్టాలు తీసుకురావాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో లే లీడర్ అధ్యక్షుడు శ్రావణ్, జె. డేవిడ్, బి ప్రభు చరణ్,ఆర్ సామెల్, ఏ వెంకటరెడ్డి, టి జోసఫ్, జాన్ వెస్లీ, ప్రభు జీవన్, జాన్సన్, పి కృష్ణమోహన్, రమేష్ బాబు, కమల్ కుమార్, జాషువా జితేందర్ రెడ్డి, మంగీలాల్ వినోద్, మోతిలాల్, బుచ్చన్న, చంటి తదితర జిల్లా కమిటీ పాస్టర్లు 300 మంది పాల్గొన్నారు.

# మొలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04:** రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఫరూక్నగర్ మండల్ మొగిలిగిద్ద గ్రామం లో మొదట గోదా రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ప్రభుత్వ పాఠశాల లో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 25 వేల నోటుబుక్స్ పంపిణీలో భాగంగా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందే సురేష్ గుప్తా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నోట్బుక్స్ పంపిణీలో భాగంగా ఈరోజు మొలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేయడం సంతోషించేదగ్గ విషయమని పేర్కొన్నారు మరియు మొగిలిగిద్ద గ్రామ పాఠశాల తెలంగాణలోని గుర్తింపు పొందిన పాఠశాల గా ఉందని అన్నారు మొగిలిగిద్ద పాఠశాల హెడ్మాస్టర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో పుస్తక కమిటీ చైర్మన్ మరియు ఫరూక్నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ గుప్తా, ఫరూక్నగర్ మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మెంబర్షిప్ కమిటీ కో చైర్మన్ హన్మారి మురళి గుప్తా,మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్యాంసుందర్ మల్లేష్, షాద్నగర్ ప్రముఖ వ్యాపారవేత్త పలబట్ల పాండురంగం గుప్తా, సామాజిక కార్యకర్త నీల రవీందర్, షాద్నగర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మాధవి నందకిషోర్, గడ్డం ఆంజనేయులు, రంగారెడ్డి జిల్లా నెంబర్ షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్, బండారి శంకర్, ఫరూక్ నగర్ మండల మాజీ అధ్యక్షులు ఎల్కుర్తి జగదీశ్వర్, ఉప్పల సత్యం, మరియు ఉపాధ్యాయులు వెంకట హరికృష్ణ, గీతా రాణి, పీ నర్సింలు, ఏ వెంకటరెడ్డి, బీఎంపీ రాజు మొలిగిద్ద వాసి నిరంజన్ మొలిగిద్ద గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామ పెద్దల ఆర్థిక సాయం



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 4:**మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన చలమళ్ళ శ్రీనివాస్ ఇటీవల అకస్మాత్తుగా మరణించగా వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి "చేయి చేయి కలుపుదాం శ్రీనివాస్ కుటుంబానికి భరోసానిద్దాం"అనే నినాదానికి ముందుకు వచ్చి కొంగరి బాలరాజు అకౌంట్ లో వేసిన 94,317 రూపాయలను మంగళవారం గ్రామ పెద్దలు అందరూ కలిసి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు.వారి భార్య పిల్లలకు ధైర్యం చెబుతూ శ్రీనివాస్ లేని లోటు తీర్చలేనిదని,ధైర్యంగా ముందుకు సాగాలని,మీ కుటుంబానికి గ్రామం భరోసాగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తినిస్తాయి అని అన్నారు.శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కూడా అభినందనలు తెలిపారు.గ్రామ మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు,మాజీ ఎంపిటిసి బడుగు రమేష్, పద్మశాలి సంఘం అధ్యక్షులు జెల్ల శ్రీనివాస్, నాయకులు గోశిక చక్రపాణి, సాయిని శేఖర్, పున్న భద్రాచలం, పున్న కనకరత్నం, చిలువేరు వెంకటయ్య, మూడుదొడ్ల రాజు, దొంత యాదగిరి, పున్న యాదగిరి, గంజి రామకృష్ణ, పున్న శివ కుమార్, సింగం ఉపేందర్ తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 'బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి'




**తొలి అక్షరం/ములుగు నవంబర్ 04:** బాలల హక్కుల పరిరక్షణ కోసం యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా సంక్షేమాధికారి తుల రవి అన్నారు. సఖి కేంద్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. బాల్యం అమూల్యమైందని, చిన్నారులు కార్మికులుగా మారొద్దన్నారు. బాల కార్మికులు లేని జిల్లాగా ములుగును తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని కోరారు. చిన్నారులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్**



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04:** గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు షాద్నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గత రెండు రోజుల నుంచి జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులలో ఆయన రంగారెడ్డి జిల్లా రిపోర్టును ప్రవేశ పెడుతూ మాట్లాడారు భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు 12 వేల రూపాయలను పూర్తిస్థాయిలో ఇవ్వాలని మహిళలకు నెలకు 2500 ఇవ్వాలని మరియు వృద్ధాప్య పెన్షన్లు 2000 నుంచి 4000 పెంచాలని గ్రామాలలో ఇల్లు లేని నిరుపే దలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంద్రమ్మ ఇల్లు కట్టివాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పై ఐక్య పోరాటాలు నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా పోరాడుతామని అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తమ సంఘంలో నిరంతర పోరాటాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ తెలిపారు.


# ప్రభుత్వ నిర్లక్ష్య నీడన వరుస రహదారి ప్రమాదాలు

**ఓవర్ లోడ్ రవాణాపై అధికారుల చర్యలేవీ?**

**ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్, ఆక్యూపెన్సీ లిమిట్ వద్దా?**

**ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే లెక్కేలేదు!**

**ప్రభుత్వంపై ఫైర్ అయిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04:** నిన్న చేవెళ్ల మండలం, మీర్జాపూర్ దగ్గర జరిగిన టిప్పర్, బస్సు దుర్ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు వారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వరుసగా జరుగుతున్న రహదారి ప్రమాదాలకు ప్రభుత్వ రవాణా వ్యవస్థ నిర్లక్ష్యమే కారణమని ఫైర్ అయ్యారు. అనేక సంవత్సరాలుగా రద్దీగా ఉండే రహదారి విస్తరణ చేపట్టక వరుస ప్రమాదాలు జరుగుతున్న గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమకు పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలు,%ు% టిప్పర్లను రవాణా అధికారులు మామూళ్ల మాయలో పడి చూసి చూడనట్లుగా వదిలి వేయడం సామాన్యుల ప్రాణాలకు సంకటంగా మారిందని అన్నారు. ప్రభుత్వ ఉచిత హామీ వల్ల ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే మహిళ ప్రయాణికుల సంఖ్య పెరగడం కారణంగాను, ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్ లేకపోవడం కారణంగాను, అధికారుల నిర్వహణ లోపం వల్ల బస్సుల్లో వరుస ప్రమాదాలు జరగడం బాధాకరం అన్నారు. నిన్నటి ఘటన 20 కుటుంబాలను చిన్నాభిన్నం చేసిందని, ఏమిస్తే ఆ కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు అంటే విలువే లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, వ్యవస్థలను గాడిలో పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు మోహన్ సింగ్, నరసింహ యాదవ్, సుధాకర్ అప్ప, కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపూర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మహిళలు ముందుండాలి

**- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 4:** జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మహిళ ముందుండాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మహిళ నాయకులు ముందుండి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇల్లు, గృహలక్ష్మి, మహిళ రుణమాఫీ,విద్య ఆరోగ్య,ఉచిత సన్న బియ్యం లాంటి పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి విస్తృతంగా మహిళలు ప్రచారం చేయాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఇంటింట ప్రచారం చేపట్టాలన్నారు.మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రతి మహిళా కార్యకర్త తమ ప్రాంతంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# వరద బాధితులకు లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320F ఆధ్వర్యంలో సహాయం





**తొలి అక్షరం/హన్మకొండ:** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ యొక్క స్వచ్ఛంద సంస్థ అయిన లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (%ాజ×ఖీ%), వరంగల్ జిల్లా అంతటా ఇటీవల సంభవించిన భారీ వర్షాలు,వరదల కారణంగా ప్రభావితమైన కుటుంబాలకు సకాలంలో మరియు కరుణతో కూడిన సహాయాన్ని అందించింది. లయన్స్ డిస్ట్రిక్ట్ 320%ఖీ% మార్గదర్శకత్వంలో సహాయక చర్యలు ప్రారంభించబడ్డాయి, ఇది అత్యంత తీవ్రంగా ప్రభావితమైన కమ్యూనిటీలకు తక్షణ సహాయం మరియు సంరక్షణతో చేరుకోవడానికి ప్రయత్నాలను చురుకుగా సమన్వయం చేస్తోంది.వరద బాధిత కుటుంబాలు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడానికి సహాయం చేయడానికి %ాజ×ఖీ% జిల్లా 320%ఖీ% కి ?12,00,000 విపత్తు సహాయ గ్రాంట్‌ను మంజూరు చేసింది.జిల్లా నాయకత్వం వారి సొంత నిధుల నుండి మరో ?3,00,000 జోడించింది, దీనితో మొత్తం ?15,00,000 అయింది. ఈ మొత్తం నిధితో, జిల్లా 950 ముఖ్యమైన కిరాణా కిట్‌లను 13 రోజువారీ అవసరాల వస్తువులు మరియు దుప్పట్లతో సహా పంపిణీ కోసం సిద్ధం చేసింది. వరదల నుండి కోలుకోవడానికి కష్టపడుతున్న కుటుంబాలకు అవసరమైన ఆహారం మరియు గృహోపకరణాలను అందించడానికి ప్రతి కిట్‌ను జాగ్రత్తగా ప్యాక్ చేశారు.బాధిత అభ్యర్థులు ప్రయోజనాలను పొందేలా చూసుకోవడానికి వివిధ ప్రదేశాలలో మరియు దశలవారీగా కిట్ల పంపిణీ జరిగింది.బొల్లికుంటలోని %ఔా=ఞ% సొసైటీ హాల్‌లో మొదటి దశ పంపిణీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో, లెనిన్ నగర్, జెక్కలొద్ది,తిమ్మాపురం, బెస్తం చెరువు, మరియపురం, షాపూర్, వడ్లకొండ, చౌటపల్లి, బొల్లికుంట, మరియు ఐనవోలు వంటి వరద ప్రభావిత ప్రాంతాల నుండి 250 కుటుంబాలు సహాయ కిట్‌లను అందుకున్నాయి. నిజమైన మరియు అర్హులైన కుటుంబాలను ముందుగా చేరుకునేలా చూసుకోవడానికి స్థానిక లయన్స్ నాయకులు మరియు సమాజ ప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. సంక్షోభ సమయాల్లో బలహీన వర్గాలకు మద్దతు ఇవ్వడంలో %ాజ×ఖీ% యొక్క లోతైన నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది.రెండవ దశ పంపిణీ కార్యక్రమం వరంగల్‌లోని శివ నగర్, సమ్మయ్య నగర్ మరియు మైసయ్య నగర్‌లలో 200 కి పైగా కుటుంబాలకు జరిగింది. స్థానిక లయన్స్ నాయకులు మరియు స్వచ్ఛంద సేవకులు బాధిత ప్రాంతాలకు సామాగ్రి త్వరగా మరియు సమర్థవంతంగా చేరేలా అవిశ్రాంతంగా కృషి చేశారు, అర్హులైన ఏ కుటుంబం కూడా వెనుకబడిపోకుండా చూసుకున్నారు.ప్రస్తుతం జరుగుతున్న వరద సహాయ సేవా కార్యక్రమంలో భాగంగా, ములుగులో 250 వరద బాధిత కుటుంబాలకు మరియు హన్మకొండలోని సమ్మయ్య నగర్‌లో 55 కుటుంబాలకు మూడవ దశ పంపిణీ జరిగింది.చివరి పంపిణీ పస్రా, తద్వాయి మరియు చల్వాయి గ్రామాలలో జరిగింది మరియు మరో 250 కుటుంబాలకు అవసరమైన సామాగ్రిని అందించారు.ఈ నిరంతర ప్రయత్నాల ద్వారా, జిల్లా 320%ఖీ% మరియు %ాజ×ఖీ% ఈ ప్రాంతంలోని ప్రతి మూలకు సహాయం అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి, ఈ విధ్వంసం నుండి కోలుకోవడానికి ఇంకా కష్టపడుతున్న వందలాది కుటుంబాలకు ఉపశమనం మరియు ఓదార్పునిస్తున్నాయి.%ఔా=ఞ% సొసైటీ హాల్‌లో జరిగిన ప్రారంభ దినోత్సవ కార్యక్రమంలో, ఇమీడియట్ పాస్ట్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ సెక్రటరీ %ాణ+ చీ.ఎ%. రావు విపత్తులు,అత్యవసర పరిస్థితులలో త్వరితంగా స్పందించినందుకు %ాజ×ఖీ% యొక్క ప్రపంచ ఖ్యాతిని ప్రశంసించారు. జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య వరద సహాయ కార్యక్రమానికి %ాజ×ఖీ% ప్రత్యేక నిధులను ఆమోదించిందని మరియు వివిధ ప్రాంతాలలో క్రమబద్ధమైన, దశలవారీ పంపిణీ ప్రణాళికను వివరించారని ప్రకటించారు. ఈ మానవతా మిషన్ విజయవంతానికి అవిశ్రాంతంగా కృషి చేసిన అంకితభావంతో ఉన్న లయన్స్ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఫస్ట్ డిప్యూటీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి, సెకండ్ డిప్యూటీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పుట్టా హరికిషన్ రెడ్డి, డిస్ట్రిక్ట్ చీఫ్ అడ్వైజర్ పొట్లపల్లి శ్రీనివాస్ రావు,ఫస్ట్ లేడీ ఆఫ్ ది డిస్ట్రిక్ట్ లయన్ డాక్టర్ కె. రాజేశ్వరి ఈ సందర్భంగా తమ ఆలోచనలను పంచుకున్నారు, క్లిష్ట సమయాల్లో కమ్యూనిటీలకు మద్దతు ఇవ్వడంలో %ాజ×ఖీ% యొక్క కీలక పాత్రను మరియు మానవాళికి సేవ చేయడంలో లయన్స్ సభ్యుల ఐక్యతను హైలైట్ చేశారు.ఈ మొత్తం సహాయ కార్యక్రమానికి మద్దతుగా డీసీఎస్ ఆర్. ప్రకాశం, డీసీటీ రఘునాథ్ రెడ్డి, ప్రోగ్రామ్ చైర్మన్ చంద్రగిరి ప్రసాద్, క్యాబినెట్ సభ్యులు డాక్టర్ జి. సురేష్ కుమార్, మార్గం ప్రభాకర్, దండే ప్రవీణ్, జీఎస్టీ కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి, ఏడీసీటీ కటంగూరు రాంగోపాల్ రెడ్డి, ఇతర లయన్ లీడర్లు సహా నిబద్ధత కలిగిన లయన్స్ నాయకుల బృందం పాల్గొన్నారు.

# మన ప్రభుత్వ బడిని కాపాడుకుందాం

- మెరుగైన మౌళిక వసతులను ఏర్పాటు చేసుకుందాం
- ఎన్నారైలు, పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలి
- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
- ఇనుగుర్తి హై స్కూల్ లో విద్యాభివృద్ధి కమిటీ సమావేశం
- ఇనుగుర్తి మండల విద్యాధికారి జె. రూపారాణి
- ఇనుగుర్తి గ్రామ విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ దార్ల రామ్మూర్తి



**తొలి అక్షరం/ఇనుగుర్తి నవంబర్ 4:** ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే భాద్యత మన అందరిదని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అలాంటి పాఠశాలలను సంరక్షించుకునే భాద్యత మనందరి పైనే ఉందని ఇనుగుర్తి మండల విద్యాధికారి జె. రూపారాణి, ఇనుగుర్తి గ్రామ విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ దార్ల రామ్మూర్తి అన్నారు. మంగళవారం నాడు స్థానిక హై స్కూల్ లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు మెరుగైన మౌళిక వసతులు ఏర్పాటు చేయడం, పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం గా ముందుకు వెళ్లాలని కమిటీ కన్వీనర్లు, సభ్యులకు సూచించారు. మౌళిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం లో గ్రామం నుండి దూర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థుల తల్లి, తండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రవేశాలు పొందేలా ప్రణాళిక చేయాలన్నారు. గ్రామం లో ప్రతీ ఇంటికి తిరిగి "ఇంటికి వంద బడికి చందా " పేరుతో సర్కారు బడిని కాపాడుకునే వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థుల యొక్క ప్రగతి పై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఇటీవలే ఇనుగుర్తి విద్యాభివృద్ధి కమిటీ పిలుపు మేరకు తన సొంత ఖర్చులతో పాఠశాలకు కంప్యూటర్ వితరణ చేసిన పారిశ్రామికవేత్త భూక్యా శోభన్ బాబు, నగదు రూపం లో కమిటీ కి విరాళాలు అందించిన ప్రతీ ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహం తో బడి బాగు కోసం, మెరుగైన మౌళిక వసతుల ఏర్పాటు కోసం ఎన్నారైలు, పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామ శ్రేయోభిలాషులు ముందుకు రావాలని, సహాయ, సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు .గ్రామ విద్యాభివృద్ధి కమిటీ కో కన్వీనర్లు గంజి రాజేందర్ రెడ్డి, ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం వీరన్న, తరగతి కన్వీనర్లు బొబ్బిలి మహేందర్ రెడ్డి, గుజ్జునూరి బాబురావు, పింగిలి శ్రీనివాస్, ఆవుల యాకన్న, దార్ల భాస్కర్, సభ్యులు కందాల రంగన్న, మల్లారెడ్డి, కొలిపాక నారాయణ, దత్తత్రి, అనుమాండ్ల యాకుబ్ రెడ్డి, ఎర్రం సాగర్, వాలంటీర్లు కొణతం స్వప్న, దార్ల సుమలత, ఉపాధ్యాయులు అమ్మ యాకయ్య పాల్గొన్నారు.

# బూటకపు ఎన్కౌంటర్లలో కమ్యూనిస్టు విప్లవకారులు

**నాడు కాంగ్రెస్ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో,నేడు బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టు విప్లవకారులను బూటకపు ఎన్ కౌంటర్లలో కాల్చి చంపుతున్నాయి**

**అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్ష పతి**




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 04:** భూమి,భుక్తి విముక్తి, సమసమాజ స్థాపన కోసం పోరాడుతున్న కమ్యూనిస్టు విప్లవ కారులను నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ చీకటి రోజులలో,నేడు బీజేపీ నరేంద్ర మోడీ,అమిత్ షా ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్ కౌంటర్లలో కాల్చి చంపుతున్నారని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి ఆరోపించారు.మంగళవారం నాడు యాదగిరిగుట్ట,రాజాపేట మండల పరిధిలోని సాదువెళ్ళి, చిన్న గౌరాయపల్లి,రఘునాథ పురం గ్రామాలలో జరిగిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని జండావిష్కరణలు జరిగాయి.గ్రామ కమిటీ కార్యదర్శులు ఇంజ శ్రీనివాస్, కొంగరి సాయి రామ్, ఎర్ర మల్లేష్ లు పార్టీ జండాలను ఎగురవేశారు.ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన కమ్యూనిస్టు విప్లవ అమర యోధులు నిరంతరం నీటిలో చేపలా,తలలో నాలుకలా మెదిలారని ఎల్లపుడూ ప్రజల గుండెల్లో కొలువై ఉంటారని,వారి ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త ప్రజలను విప్లవంలో భాగస్వామ్యం చేయాలని కోరారు.కేంద్రంలో,రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ,కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల సమస్యల పరిష్కారంలో దొందూ దొందేనని అన్నారు.బీజేపీ ఇచ్చిన వాగ్దానం ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేని స్థితిలో ఉన్నదని,రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసు మేరకు కనీస మద్దతు ధర చెల్లించకుండా తప్పించుకుంటుందని,వర్షాల వల్ల రైతులు తమ ధాన్యం తడిసిపోయి అల్లాడుతుంటే,ఇవి ఏమీ పట్టకుండా ఎంత సేపు మతతత్వ ఆలోచనతో ప్రజలను తమ మౌలిక సమస్యల నుంచి తప్పుదోవపట్టించే మతోన్మాద అరాచక పాలనకు పూను కుంటుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్,ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, గడ్డం మంకయ్య, ఉచ్చంతల మల్లేష్,సుంకె సుగుణ,సుంకె బాలయ్య,జాలిగం భుజంగం, మీస నర్సయ్య,ఇంజ రామచంద్రయ్య,బరిగే రాములు, గడ్డం యాదగిరి, బోగ పుండరీకం, దయ్యాల రాములు, దొంకెన శ్రీను, జాలిగం అంజయ్య,ఓరుగంటి కిష్టయ్య, దయ్యాల సిద్దులు, ఈరోళ్ళ బాలయ్య, శవ్వాల సిద్దులు, ఇంజ కిష్టయ్య, దొంకెన లక్ష్మీ నర్సు,మేక అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు: ములుగు ఎస్పీ శబరిష్



**తొలి అక్షరం/ములుగు నవంబర్ 04 :**పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇప్పించేలా కోర్ట్ తీర్పు చెప్పిందని ఎస్పీ శబరిష్ తెలిపారు. ములుగు జిల్లా వాజేడుకు మండలానికి చెందిన నిందితుడు సోడి సందీప్ పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడన్నారు. ఈ మేరకు మంగళవారం అతనిపై నేరం రుజువు కాగా జిల్లా కోర్టు జీవిత ఖైదుతో పాటు, రూ.9 వేల జరిమానా, బాధితురాలికి రూ. 10 లక్షల నష్టపరిహారం ఇచ్చేలా తీర్పునిచ్చిందన్నారు

# బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 4:** రిజర్వేషన్ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని సంఘాల చైర్మన్ రాంపాక సుధాకర్ కోరారు. మంగళవారం 42 శాతం రిజర్వేషన్ సాధన సమితి పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రిప్రెజెంటేషన్ జరుగుతుంది అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో %దీజ ఝఎ దీజ నాజ నా జీూజ% ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారికి 42% విద్య ఉద్యోగ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ బిల్లు 9వ షెడ్యూల్లో చేర్చాలి, కామారెడ్డి డిక్లరేషన్ అమలు గురించి రిప్రెజెంటేషన్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి %ఎఎ ంఎ ర్ ఝఎ% జిల్లా కోఆర్డినేటర్ రాంపాక సుధాకర్ మాట్లాడుతూ 42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి తరపున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ ముఖ్యంగా డిమాండ్స్ రాష్ట్రంలోని పిల్ నెంబర్ 3 మరియు 4 ద్వారా మార్చి 2025లో విద్యా ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ఆమోదించింది. ఈ బిల్లు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడి గత ఏడు నెలలుగా కేంద్రం వద్ద



తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడానికి పెండింగ్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచి తొమ్మిదవ షెడ్యూల్లో అమలు చేయించే బాధ్యతను తనపై వేసుకొని ఆ దిశగా చర్యలు చేపట్టాలి ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మనవి చేస్తున్నాం 2) రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును తొమ్మిదో షెడ్యూల్లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం 3) 42% రిజర్వేషన్ లో ఉప వర్గీకరణ సబ్ క్యాటగిరేషన్ చేయాలి అత్యంత వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలి. 4) కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించిన మొదటి సంవత్సరంలో కేటాయించిన 9200 కోట్లలో కేవలం 2068 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు ఈ సంవత్సరం కూడా ఖర్చులు అలాగే ఉన్నాయి కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం బీసీల విద్య ఉపాధి ఆర్థిక అభివృద్ధి కోసం మొత్తం 40 వేల కోట్లు తక్షణమే అనగా ఈ ఆర్థిక సంవత్సరంలోగా ఖర్చు చేయాలి మరియు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో చేసిన అన్ని హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం 5)రాష్ట్రంలో అన్ని నామినేటెడ్ పోస్టులు కమిషన్లు బోర్డులు మరియు సలహా మండల్లో 90 శాతం ప్రాతినిధ్యం బీసీ ఎస్సీ ఎస్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం ఇది సామాజిక న్యాయం సమాన అవకాశాలు తగు ప్రాతినిధ్యం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమని మేము గట్టిగా నమ్ముతున్నాం. ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రంగ కోరుతున్నాం. దాసరి లక్ష్మినివాస్ మహబూబాబాద్ మండల భాద్యులు, మంగళపెల్లి రాజకుమార్ %ఎంం% జిల్లా ఉపాధ్యక్షులు, రాయల రమేష్ %ఎంం% సీనియర్ నాయకులు, పెండ్యాల బాబు, డోనక ఐలయ్య %ుంజూ% తొర్రూర్ మండల అధ్యక్షులు, కొమ్ము ఎల్లయ్య %ుంజూ% నర్సింహులపేట మండల అధ్యక్షులు, తనికెటి రాజా రేపల్లి నరేష్ కుమార్ రజక, దొంతు పురుషోత్తం పద్మశాలి జిల్లా యువజన అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# 39వ డివిజన్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**తొలి అక్షరం/కడప నవంబర్ 04 :-** కడప నగరంలోని39 వ డివిజన్ ఇంచార్జ్ పీరా ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాసీమ బాబు ఆఫీస్ దగ్గర నుంచి ఇంటింటికి వెళ్లి డివిజన్ ప్రజలకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే మెడిసిన్ విద్యార్థులకు మరియు ప్రజలకు అందే వైద్యం కొరకు జరిగే నష్టాల గురించి వివరించి ప్రభుత్వం నడిపితే కలిగే లాభాల గురించి వివరిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మాసీమ బాబు నార్త్ జోన్ మండల అధ్యక్షుడు ఇలియాస్ బి.హెచ్. 39 వ డివిజన్ పరిశీలకులు వెంకట్, మరియు ఖాదర్ బాషా రవి ఖాదర్ రహమతుల్లా అర్ఫాత్ యూసుఫ్ హస్సేన్ ఈనాయత్ జాకిర్ తదితరులు పాల్గోన్నారు.

# నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు గౌరవం ఉండాలి

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్

## నాయి బ్రాహ్మణుల ప్రతి షాపుకి రేట్ల పట్టిక, ఐడి కార్డులు పంపిణీ







**తొలి అక్షరం/ఖమ్మం నవంబర్ 04:** తరతరాలుగా సమాజ సేవే లక్ష్యంగా కులవృత్తిని నమ్ముకుని పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు గౌరవం ఉండాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్ అన్నారు. ఖమ్మం నగరంతో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయి బ్రాహ్మణులకు తన సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన ఐడి కార్డులతో పాటు రేట్ల పట్టికను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణులు తమ కులవృత్తిని కాపాడుకుంటూ సమాజంలో గౌరవంగా ఉండేందుకు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనాదిగా వస్తున్న కులవృత్తిని సమాజ సేవలో భాగంగా జీవనోపాధి కొరకు మాత్రమే నాయి బ్రాహ్మణులు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. కానీ ఆర్థిక సంపాదనే ధ్యేయంగా కొన్ని కార్పొరేట్ శక్తులు నాయి బ్రాహ్మణుల చేతుల్లో ఉన్నటువంటి కులవృత్తులను కొల్లగొట్టి, వ్యాపారం ఎవరైనా ఎక్కడైనా చేయవచ్చు అనే కుటిల బుద్ధితో వ్యాపారాలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని వాటన్నింటినీ ఎదుర్కోవటానికి నాయి బ్రాహ్మణులు సిద్ధంగా ఉండాలని గుర్తు చేశారు. కార్పోరేట్ శక్తులు చేసేది వ్యాపార దృక్పథమే కానీ సమాజానికి మేలు చేసేదిగా ఉండదని, ప్రజలు కూడా గమనించాలని పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణులు ప్రతి కార్యాన్ని కూడా స్వయాన ఇంటికి వెళ్లి సేవలు అందిస్తారని అందుకే నాయి బ్రాహ్మణులకు సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని తెలియజేశారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ లో ఉన్న నాయి బ్రాహ్మణ సోదరులందరికీ షాపు షాపుకి రేట్ల పట్టిక, షాపులలో పనిచేసే వారికి యలమందల జగదీష్ తన సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన సంఘ ఐడీ కార్డ్స్ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ను సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నంద్యాల నరసింహారావు, నగర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు, నగర ఉపాధ్యక్షులు శ్రీరాముల విజయ్, నగర సహాయ కార్యదర్శి సురభి సందీప్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి, వరంగల్ క్రాస్ రోడ్డు అధ్యక్షులు మాదాపూర్ సైదులు, ప్రధాన కార్యదర్శి శ్రీరాముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పరిధి దాటితే చర్యలు తప్పవు

## - ఆర్.ఎమ్.పిలకు అధికారుల హెచ్చరికలు



**తొలి అక్షరం/పులివెందుల నవంబర్ 04:-** పులివెందుల డివిజన్ పరిధిలోని ఆర్.ఎమ్.పి ( రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ ) లకు పులివెందుల రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ అధ్యర్యంలో సమావేశం నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల పరిధిలోని ఆర్. ఎమ్. పి అందరూ తమ పరిధికి మించి వైద్యం చేయరాదని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే తమ క్లీనిక్ లు నడుపుకోవాలని,ఇంజక్షన్, వేయరాదని, ఐ. వి ఫ్లూయిడ్స్ పెట్టారదని, ఆంటిబయోటిక్స్, ఇవ్వరాదనీ తెలిపారు సి ఐ రమణ మాట్లాడుచు పరిధి దాటి తే చర్యలు తప్పవని తెలిపారు, ఆర్.ఎమ్.పి కు పేరు ముందు డాక్టర్ అని పెట్టారదని, ప్రథమచికిత్సా మాత్రమే చెయ్యాలని డీప్యూటీ డిస్టిక్ మెడికల్ అధికారి తెలిపారు సమావేశం లో డెమో భారతి, ఆరోగ్యావిధ్యవిస్తరణాధికారి రమణమ్మ, పులివెందుల సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆర్.ఎమ్.పి లు పాల్గొన్నారు

# వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి: ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ







## • విద్యార్థుల హాజరుపై, విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించాలి

**తొలి అక్షరం/ఖమ్మం నవంబర్ 04:** జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు రాబోయే పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో కృషి చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈఓలతో జిల్లా విద్యా పరిస్థితులపై డాక్టర్ శ్రీజ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థి జీవితంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు మలుపు తిరిగే దశలని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు వారానికి రెండుసార్లు తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల అభ్యాసంపై ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల బలహీనతలను గుర్తించి, అదనపు శిక్షణ ఇవ్వాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలను పునరావృతంగా బోధిస్తూ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆమె సూచించారు. ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు లక్ష్యాన్ని చేరేలా ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ హితవు పలికారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్లో వంద శాతం నమోదు కావాలని, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గైర్హాజరు విద్యార్థుల వివరాలు తెలుసుకుని, వారిని తిరిగి తరగతులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా, ప్రతి విద్యార్థికి అపార్ నంబర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని, సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. యుడైస్ పోర్టల్లో ప్రతి విద్యార్థి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మండల విద్యాధికారులు పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, ప్రతి విద్యాసంస్థలో హాజరు శాతం 90 శాతానికి మించి ఉండేలా చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. సమీక్ష సందర్భంగా హైస్కూల్ హెడ్మాస్టర్ల హ్యాండ్బుక్ను డాక్టర్ పి. శ్రీజ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థి దశ నుండే చట్టసభలు, రాజ్యాంగంపై అవగాహనలు ఉండాలి



**తొలి అక్షరం/పతికొండ నవంబర్ 04:-** నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థి దశ నుండే విద్యార్థులకు చట్టసభలు, రాజ్యాంగం పై అవగాహనలు కలిగి ఉండాలని పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి గురుకుల పాఠశాల విద్యార్థిని గాయత్రి ఎంపిక కావడం పట్ల పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని గాయత్రి కి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన చట్టసభలు ఎలా నడుస్తాయో భావి తరాలకు తెలియాలంటే మాక్ అసెంబ్లీలు వంటివి అవసరం అన్నారు. సభా పద్ధతులు ఎలా నడుస్తాయో ప్రత్యక్షంగా చూపిస్తూ, చిన్నప్పటినుంచే ప్రజాస్వామ్య విలువలను విద్యార్థులకు నేర్పించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. మారుతున్న కాలానికి టెక్నాలజీ కి అనుకూలంగా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే మహోత్తర బాధ్యత ఉపాధ్యాయులదేనని. రాష్ట్ర భవిష్యత్తు, దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. మాక్ అసెంబ్లీ సమావేశాలు ఎలా జరుగుతాయి. ప్రజల సమస్యలపై ఎలాంటి చర్చ జరుగుతుంది. దేశ ప్రజలకు అవసరమైన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతోపాటు చట్టాలు రూపకల్పన లాంటి పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తాయి. ఇక్కడ ఉన్న విద్యార్థుల్లో రేపటి రోజున గొప్ప గొప్ప నాయకులుగా తయారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసూన, డాక్టర్ ఆర్ అరుణ, స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.



# పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో

# పిఠాపురంలో..అలా మొదలయ్యింది



తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.


# రాజాసాబ్ సంక్రాంతికి పక్కా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




# చరణ్ ను ఫాలో అవుతున్న రామ్





తెలుగు సినిమా హీరోల ట్యాగ్ అప్పుడప్పుడు మారుతూ ఉండటం చాలా సందర్భాల్లో చూస్తూనే వచ్చాం. హీరో కెరీర్లో బాగా పైకి ఎదిగినప్పుడో లేదంటే భారీ హిట్ అందుకున్నప్పుడో, ఆ స్థాయికి తగ్గట్టు కొత్త ట్యాగ్ ను పెట్టుకోవాలని భావించి, ఆ ఇమేజ్ కు తగ్గ ట్యాగ్స్ ను పెట్టుకుంటారు. అయితే ఆ ట్యాగ్స్ ను ఆడియన్స్ అన్నీ సందర్భాల్లో యాక్సెప్ట్ చేయాలని లేదు. గ్లోబల్ స్టార్ నుంచి మళ్లీ మెగా పవర్ స్టార్ చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్ ఆ సినిమా తర్వాత తన పేరుకు ముందు గ్లోబల్ స్టార్ అనే కొత్త ట్యాగ్ ను తగిలించుకుని, పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్ ను పక్కన పెట్టారు. కానీ చరణ్ గ్లోబల్ స్టార్ అనే ట్యాగ్ తో చేసిన ఆచార్య, గేమ్ ఛేంజర్ సినిమాలు ఫ్లాపవడంతో ఆ ట్యాగ్ పై నెట్టింట చాలా విమర్శలొచ్చాయి. దీంతో తన నెక్స్ట్ మూవీ కోసం చరణ్ తన పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్ గానే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఉస్తాద్ ను వద్దనుకుంటున్న రాపో ఇప్పుడు చరణ్ ను చూసి మరో యంగ్ హీరో కూడా అదే బాట పడుతున్నట్టు తెలుస్తోంది. అతను మరెవరో కాదు, టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని. టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ గా మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇస్మార్ట్ శంకర్ సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత తన ట్యాగ్ ను ఉస్తాద్ గా మార్చుకున్నారు. ఎనర్జిటిక్ స్టార్ నుంచి ఉస్తాద్ గా మారినప్పటి నుంచి రామ్ ఇప్పటివరకు హిట్ ను అందుకున్నది లేదు. పైగా ఆడియన్స్, ఫ్యాన్స్ కూడా రామ్ ను ఉస్తాద్ అనే దానికంటే ఎనర్జిటిక్ స్టార్ అని పిలుచుకోవడానికే ఆసక్తి చూపారు. అందుకే ఇప్పుడు రామ్ తిరిగి తన పాత ట్యాగ్ కు షిఫ్ట్ అవుతున్నారు. తన తర్వాతి సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా కోసం రామ్ ఎనర్జిటిక్ స్టార్ అనే ట్యాగ్ నే పెట్టుకుంటున్నారు. కొత్త ట్యాగ్ లు పెట్టుకోవాలంటే ఫ్యాన్స్ కు ఇష్టముండాలని భావించిన చరణ్, రామ్ ఇకపై తమ పాత ట్యాగ్‌ల తోనే కంటిన్యూ అవాలని ఆసక్తి చూపుతున్నారు.

# దుల్కర్ సల్మాన్..కాంత మూవీ




మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు.ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.